
పడమటి సంధ్యారాగం
రచన
తుల్లి రాజగోపాల్

# తుల్లి రాజగోపాల్ కథలు

1) తాత ముత్తాతల ఊరు
2) రెప్పపాటు జీవితం
3) జాతక మహత్యం
4) నేను సైతం
5) అమ్మా, పేరంటానికి పోదాం రావే
6) శృంగారపుం
7) పడమటి సంధ్యారాగం
8) మార్పు
9) ఆదర్శగ్రామం
10) సెలవు రోజు స్నేహితుడి ఇల్లు
11) అబ్బాయి పెళ్లి
12) అనూహ్యం
13) హీరో – జీరో
14) నిరీక్షణ
15) ఇది వార్త కాదు




# తాత ముత్తాతల ఊరు

**మా** తాత ముత్తాతలు జీవించిన గడ్డ మీద అడుగు పెట్టబోతున్నానన్న ఆలోచన నన్ను ఎంతో ఉద్వేగానికి లోను చేస్తోంది. ఎంత తొందరగా ఆ ఊరు చేరతానా అని ఆతృతగా ఉంది. నేను సివిల్ సర్వీసుకు ఎంపికైన వెంటనే మా అమ్మ నన్ను ఆ ఊరికి వెళ్ళి రమ్మని చెప్పింది. నాకు ఊహ తెలిసిన తర్వాత ఆమె ఎప్పుడూ ఏ కోరికా కోరినట్లు నాకు గుర్తు లేదు. ఆమె కోరిన మొదటి కోరిక బహుశా ఇదేనేమో.

జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకున్న ప్రతి ఒక్కరికి తమ సొంత ఊరు జ్ఞాపకం వస్తుందేమో. అమెరికాలో ఉన్నా, ఇంగ్లాండులో ఉన్నా పుట్టిన ఊరి మట్టిమీద

మమకారం పోదు.  నేను సివిల్స్ విజేతగా ఎన్నికైనట్లు తెలియగానే అమ్మ ఆనందానికి అవధులు లేవు.  సంతోషంతో కంట తడి పెట్టింది.  ఈ సంతోషాన్ని పంచుకోడానికి నా విజయాన్ని చూసి మురిసి పోవడానికి నాన్న భౌతికంగా లేరు.

ఎక్కడో గోదావరి ప్రక్కన ఉన్న మారుమూల అడవి ప్రాంతంలోని చిన్న గూడెంలో పుట్టిన మా నాన్న రామన్నదొర ఆ రోజుల్లో ఎలా చదివాడో తెలియదు.  ఎంతో కష్టం మీద ఆరో తరగతి వరకు చదవ గలిగాడు.  మా నాన్నకు చదువు విలువ తెలియజేసింది మా ముత్తాత రాజన్నదొర అట.

"చదువుకున్నోడు లోకాన్ని జయించవచ్చురా" అని మా ముత్తాత ఎప్పుడూ చెబుతుండే వాడని నాన్న నాతో అనేకసార్లు అనేవాడు.

నాన్న అమ్మను పెళ్ళి చేసుకున్న ఏడాదిన్నరకు నేను పుట్టానంట. "మీ పిల్లల భవిష్యత్ కోసమైనా ఈ అడవి నుంచి దూరంగా పట్నం వెళ్ళి పోండిరా" అని మా తాత, ముత్తాత చెప్పడంతో అమ్మా నాన్న వాళ్ళందరిని వదల్లేక, వదల్లేక వదిలి నా కోసం ఇంతదూరం హైదరాబాద్ వచ్చేశారు.  నన్ను పెంచడానికి, నా చదువు కోసం అమ్మా నాన్న ఎన్నో కష్టాలు పడ్డారు.  ఊరుకాని ఊళ్ళో ఎవరూ తెలియని ఈ ప్రాంతంలో నాన్న అనేక రకాల పనులు చేసి కుటుంబాన్ని పోషించే వాడు. నేను బాగా చదువుకుని వాళ్ళందరికీ మంచి పేరు తేవాలని చెబుతుండేవాడు.

మా నాన్న గొప్ప అందగాడు కాదుగాని ఆయనలో ఏదో ఆకర్షణ ఉండేది. మరీ ఎత్తు కాదు, పొట్టి కాదు.  చామనఛాయతో మనిషి ఎప్పుడూ ఉత్సాహంగా కనిపించేవాడు.  నా భవిష్యత్ గురించి ఎప్పుడూ తపన పడేవాడు.  మా అమ్మ సీతక్క భర్తకు తగ్గ ఇల్లాలు.  దబ్బపండు రంగుతో నుదుట రూపాయి కాసంత బొట్టుతో నిండుగా కళకళలాడుతూ ఉండేది.  నాన్నపోయిన తర్వాత ఆమె ముఖం కళ తప్పింది.  నేను డిగ్రీలో ఉండగానే నాన్న మాకు దూరమయ్యాడు.  అమ్మ నా కోసమే బ్రతుకుతోంది.  ఆమెకు జీవితం పట్ల, సాటి మనుషుల పట్ల, ప్రకృతి పట్ల ఎంతో మమకారం.

నన్ను ప్రయోజకుడిగా చూడాలని తపన పడి, ఇన్ని మైళ్ల దూరం వచ్చిన నాన్న

నన్ను ఆస్థానంలో చూడకుండానే ఈ లోకం నుంచి నిష్క్రమించాడు. నాన్న కోరిక తీర్చడానికి నేను మరింత శ్రమించాను. డిగ్రీ అవగానే సివిల్స్ ఎగ్జామ్ కోసం రాత్రీపగలు ప్రిపేరయ్యాను. అన్నీ కలిసొచ్చాయి. నా లక్ష్యం చేరుకోగలిగాను. మొదటిసారి సివిల్స్ రాసిన నేను టాప్‌టెన్‌లో ఒకడిగా నిలిచాను.

అమ్మ ఆనందానికి అవధులు లేవు. ఏం ఆశించి వాళ్ళు ఇంత దూరం వచ్చారో నేను అది సాధించగలిగాను. కాని ఆ సంతోషాన్ని పంచుకోడానికి అమ్మా, నేను తప్ప ఇక్కడ ఇంకెవరూ లేరు. ఎప్పుడో నేను ఏడాది పిల్లాడుగా ఉండగా ఆ అడవి నుంచి హైదరాబాద్ వచ్చేశారు అమ్మా నాన్న. ఇప్పుడు అమ్మ మాత్రమే నాకు మిగిలిన ఏకైక పెద్దదిక్కు.

దేశంలో ఎంతోమంది పొందాలని కలలుగనే జాబ్‌ని నేను సాధించాను. ఇప్పుడు నేను అందరిలోను ప్రత్యేకం. అన్ని పత్రికలు నా గురించి వ్రాశాయి. టీవీ ఛానళ్ళు ఇంటర్వ్యూ చేశాయి. అమ్మ, నాన్న గురించి, నన్ను ఈ పొజిషన్‌లో చూడ్డానికి వాళ్ళు ఎంత జీవితాన్ని త్యాగం చేశారనేది, పుట్టిన ఊరుని, అయిన వాళ్ళని వదిలి ఇంత దూరం వచ్చి ఒంటరిగా ఒకరికొకరుగా ఎలా జీవించింది మీడియాకు వివరించాను.

మనసులో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సంతోషతరంగం నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. నాన్న కోరిక తీర్చాను. మా తాత, ముత్తాతలు కలగన్న స్థాయికి చేరుకోగలిగాను. ఎన్నో ఏళ్ళ క్రితమే వాళ్ళు ముందు చూపుతో నాన్నను అక్కడ నుంచి ఇంతదూరం పంపించిన లక్ష్యం నెరవేరింది. ఇప్పుడు ఈ ఆనందాన్ని పంచుకోడానికి నాన్నతో సహా వాళ్లెవరూ ఈ భూమ్మీద లేరు.

ఇలాంటి సమయంలో అమ్మ నన్ను వాళ్ళ ఊరు వెళ్ళి రమ్మంది. మా తాత ముత్తాతలు భౌతికంగా లేక పోయినా అక్కడికి వెళ్ళి ఆ మట్టికి ప్రణమిల్లి రమ్మంది. ఆ పరిసరాలను, ఆ వాతావరణాన్ని, అక్కడి మనుషుల జీవన విధానాన్ని పరిశీలించమంది. వచ్చేటప్పుడు ఆ ఊరి నుంచి ఇంత మట్టి తీసుకురారా అంది. ఈ చివరి మాటలు చెబుతున్నప్పుడు అమ్మ గొంతుకు ఏదో అడ్డు పడినట్లుగా ఇక

మాట్లాడలేక పోయింది. ఆమె కళ్ళు తడి అయ్యాయి.

అందుకే అమ్మకోరిక తీర్చాలని బయలుదేరాను. నేను కూడా అక్కడే పుట్టాను. నా మూలాలు ఆ మట్టిలోనే ఉన్నాయి. కాని ఏడాది వయసు ఉన్నప్పుడే అక్కడి నుంచి తీసుకు వచ్చేశారు. తాత ముత్తాతలంతా అక్కడే ఆ గడ్డమీదే పుట్టారు. ఆ కొండ కోనల్లోనే జీవించి ఆ మట్టిలోనే కలిసి పోయారు. కాని వారి ఆశలకు ప్రతిరూపమైన నేను ఇప్పుడు ఉన్నత స్థానానికి చేరుకున్నాను. ఆ రోజుల్లో నాన్న తెగించి ఇంత దూరం రాకపోయి ఉంటే నేను కడా ఆ అడవి తల్లి బిడ్డగానే బ్రతుకుతూ అక్కడే ఏదో ఒక పని చేసుకుంటూ ఉందునేమో....

నా ఆలోచనలతో సంబంధం లేనట్లుగా హైదరాబాదులో బయలుదేరిన గోదావరి ఎక్స్‌ప్రెస్ వేగంగా వెళుతోంది. ప్రయాణికులంతా నిద్రలో ఉన్నారు. సంతోషం, ఉద్వేగం, ఏదో తెలియని అనుభూతి కలగా పులగమై నాకు నిద్ర రాకుండా చేస్తోంది. ఇంకా తెలవారకుండానే గోదావరి ఎక్స్‌ప్రెస్ రాజమండ్రి చేరింది. నా బ్యాగ్ తీసుకుని స్టేషన్‌లో దిగాను. అక్కడి వెయిటింగ్ హాలులో కాలకృత్యాలు తీర్చుకుని ఫ్రెష్ అయ్యి ఆటోలో గోదావరి ఒడ్డుకు చేరుకున్నాను. అక్కడ లాంచీల రేవు నుంచి టూరిజం బోట్లు పాపికొండలు, భద్రాచలం వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నాయి. నేను ఒక దాన్లో ఎక్కాను. బోట్లో చాలామంది టూరిస్టులు ఉన్నారు. వారిలో ఎక్కువ మంది పాపికొండలు చూడ్డానికి వెళ్ళే వాళ్ళే ఉన్నారు. కొంతమంది మాత్రం భద్రాద్రి రామయ్య దర్శనానికి వెళుతున్నారని తెలిసింది.

ఉదయమే గోదావరి నది మీద బోటు ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. పాత, కొత్త రైలు వంతెనలు, వాటికి కొంత దూరంలో గోదావరి లంక గ్రామాలు. ఆ లంకల్లో నివసించే మత్స్యకారులు... నాటు పడవలపై చేపల వేటకు ఉపక్రమిస్తున్న జాలర్లు, స్నానాల రేవుల్లో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు, ప్రశాంతంగా ప్రవహిస్తు గోదావరి... ఆ వాతావరణం ఎంతో అద్భుతంగా ఉంది.

నదిలో ఈదుకుంటూ కొన్ని గేదెలు లంకలవైపు వెళుతున్నాయి. వాటిని చూసి ఎవరో పెద్దాయన "లంక మేత గోదారి ఈత అంటే ఇదే" అన్నాడు. అంతా

నవ్వారు. నాకూ నవ్వొచ్చింది. ఒడ్డు నుంచి అంత దూరం ఈదుకుంటూ లంకల్లోకి వెళ్ళే ఆ గేదెలు అక్కడ మేత మేసి మళ్ళీ నదిలో ఈదుకుంటూ వెళ్ళే సరికి అవి తిన్నదంతా అరిగిపోతుంది. కొంతమంది మనుషులు జీవితాలు కూడా ఎంత కష్టపడినా అంతే అనిపించింది.

ఆ ప్రయాణంలో నాతో సహా అంతా ప్రకృతిని చూసి పరవసించి పోతున్నారు. దూరంగా కొండలు కనిపిస్తున్నాయి. అవే పాపికొండలని ఎవరో చెబుతున్నారు. గలగల పారే గోదావరి, పచ్చదనంతో కనువిందు చేస్తున్న కొండలు, ఆకాశంలో ఎగిరే పక్షుల గుంపులు, నీటిలో కనిపించి మళ్ళీ మాయమవుతున్న చేపలు, చల్లగా వీస్తున్న పిల్ల తెమ్మర.. ఓహ్! ఎంత సుందర దృశ్యాలు.... పర్యాటకులంతా పరవశించి పోతున్నారు. కొందరు సెల్‌ఫోన్ కెమెరాలతో ఆ దృశ్యాలను బంధిస్తున్నారు.

కొంతసేపటికి ఏదో ఊరు వచ్చినట్లుంది. బోటు ఒడ్డుకు చేరింది. బోటు నడిపే వ్యక్తితో పాటు ఉన్న అసిస్టెంటు "మీరు దిగాల్సింది ఇక్కడే నండి" అని నాతో చెప్పాడు. బోటును, ఒడ్డును కలుపుతూ అందులోని వాళ్ళు దిగడానికి ఒక చెక్క బల్లలాంటిది వేశారు. నాతో పాటు కొంత మంది మాత్రమే అక్కడ దిగారు. అక్కడి నుంచి సుమారు పదిమైళ్ళ దూరం ఆ అడవిలో నడిచి వెళ్ళాలి. ఆ తర్వాత వచ్చే కొండ ఎక్కి దిగి అవతలి వైపు కొంత దూరం వెళితే మా ఊరు వస్తుందని అమ్మ చెప్పింది.

నేను బోటు దిగిన గోదావరి ఒడ్డు ప్రక్కనే చిన్న ఊరు ఉంది. అక్కడ కొన్ని ఇళ్ళు కనిపిస్తున్నాయి. అక్కడి నుంచి అడవిలోకి నడిచి వెళ్ళడానికి కాలిబాట ఉంది. దారిలో ఒకటి రెండు గూడేలు వస్తాయని అక్కడి వాళ్ళు చెప్పారు. చుట్టూ దట్టమైన అడవి.

నెమ్మదిగా నడవడం మొదలు పెట్టాను. నావెనుక ఒక వ్యక్తి నడిచి రావడం గమనించాను. కాషాయం రంగు చొక్కా, కింద బిగించి కట్టిన పంచె, తలకు చుట్టిన గుడ్డ... నుదుటన కుంకుమ బొట్టు, చిన్న ముక్కు, చురుగ్గా చూసే కళ్ళు. మనిషి కాస్త నల్లగా ఉన్నాడు. సుమారు ముప్పై ఐదేళ్ళ వయసుంటుంది. భుజానికి

ఒక సంచి ఉంది. చూడ్డానికి ఎవరో కొండదొరలా ఉన్నాడు. పట్టణాలకు వచ్చి జాతకాలు చెబుతామని తిరిగే వ్యక్తిలా కనిసిస్తున్నాడు.

నేను అతని వంక చూస్తుండడంతో "ఎక్కడికి వెళ్ళాలి దొరా?" అని అతనే పలకరించాడు.

"రామరాజుగూడెం" చెప్పాను నేను.

"అబ్బో దూరమే... ఎంతలేదన్నా ఈ కోనలో మూడు గంటలు నడవాల్సి ఉంటుంది దొర" అన్నాడు.

"నీకు తెలుసా?" అడిగాను.

"మాది ఈ దారిలోనే ఉన్న సింగన్నగూడెం. నేను అటువైపు ఎప్పుడు వెళ్ళలేదు దొర. ఆ గూడెం కొండకు అటువైపు ఉంటుంది. చాలా దూరం నడవాలి. అక్కడ ఎవరున్నారు దొర?" అడిగాడతను.

నేను చిన్నగా నవ్వుతూ "అది మా పూర్వీకుల ఊరు. అయితే ఇప్పుడు వాళ్ళెవరూ అక్కడ జీవించి లేరు" అన్నాను. అతను ఆశ్చర్యంగా చూస్తూ "ఎక్కడినుంచి వత్తున్నావు దొరా" అనడిగాడు. హైదరాబాదు నుంచని చెప్పాను. అతను మరింత ఆశ్చర్యపోతూ "ఎందుకు దొర ఇంత దూర మొచ్చావ్?" అన్నాడు.

నేను వచ్చిన పని చెప్పాను. మా నాన్న రామన్న దొర, తాత పోతన్నదొర, ముత్తాత రాజన్నదొర గురించి చెప్పాను. మా ముత్తాత పేరే నాకు పెట్టారని చెప్పాను.

"అట్టాగా దొర... నిన్ను సూత్తే బలే ఇదిగా ఉందే... నా పేరు కొండన్న దొర. ఈ అడవిలోనే పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఏదో కొండ దేవత దయవల్ల వారసత్వంగా వచ్చిన విజ్జతో పట్నం వెళ్ళి జాతకాలు చెబుతూ పొట్ట పోషించు కుంటున్నాను. ఎక్కువగా ఊళ్ళు పట్టుకుని తిరుగు తుంటాను. మా కెవరూ సదువు ఇలువ సెప్పలేదు దొర... ఇక్కడే పుట్టాం, పెరిగాం, ఈ మట్టిలోనే కలిసి పోతాం. మా బిడ్డోళ్ళు కూడా ఈడనే ఉంటారు. పెద్దగా సదువు మీద ధ్యాస ఉండదు. అలా గాలికి తిరుగుతుంటారు" చెప్పుకొచ్చాడు.

నాకు బాధగా అనిపించింది. కల్లాకపటం తెలీని అడవి బిడ్డలు. పట్నం వాళ్ళకున్న లౌక్యం వీళ్ళకు ఉండదు. అడవి తల్లినే నమ్ముకుని జీవిస్తారు. అటవీ ఫల సాయంతో జీవితం వెళ్ళ దీస్తుంటారు. వీళ్ళు ఏరుకొచ్చిన అటవీ ఫలసాయానికి ఎంతో కొంత ముట్టచెప్పి దళారులు మాత్రం జేబులు నింపుకుంటారు. చదువు లేక పోవడం వల్లనే ఎక్కువగా మోస పోతుంటారు.

అందుకే అతనితో "కొండన్న దొరా, నీ కొడుకును నాతో పంపిస్తావా, బాగా చదివించి ప్రయోజకుడ్ని చేస్తాను" అన్నాను. అంతవరకు నా ప్రక్కనే నడుస్తున్న అతను ఆ మాటలకు ఒక్కసారిగా ఆగిపోయాడు.

"ఏంది దొర ఏమన్నావ్? నాబిడ్డను నిజంగా సదివిత్తావా దొరా....!" అతని కళ్ళల్లో సంభ్ర మాశ్చర్యాలు. కళ్ళలో సన్నటి నీటి పొర కనిపిస్తోంది. ఇంతవరకు అతనెవరో నేనెవరో... కాని ఆ ఒక్కమాటతో నేను ఎంతో ఆప్తుడ్ని అయిపోయినట్టుగా అతను నా దగ్గరకు వచ్చి నా రెండు చేతులూ పట్టుకున్నాడు. అడవిలో నడుస్తుండడం వల్ల ఇద్దరకీ చెమట్లు పడుతున్నాయి. అతని చేతుల తడి నాకు తెలుస్తోంది. కాని చిత్రంగా అతని నుంచి చెమట వాసన రావడం లేదు. మనిషి దగ్గర నుంచి ఏదో మంచి వాసన వస్తోంది. పొట్ట పరిశుభ్రంగా ఉండడం వల్ల కాబోలు అతని శ్వాస నుంచి చెరకు వాసన వస్తోంది.

అమాయకంగా కనిపిస్తున్న అతన్ని చూస్తే నాకు ఎంతో అభిమానం కలిగింది. నేను అతని చేతుల్ని ఆప్యాయంగా నొక్కుతూ "నిజంగానే దొర" అన్నాను. ఆ స్పర్శ మాఇద్దరిని మానసికంగా మరింత ఆత్మీయుల్ని చేసింది. అంతవరకు తన గూడెం రాగానే ఆగిపోదామనుకున్న అతను "దొరా నీ కూడా నేను వత్తాను" అన్నాడు. ఆ అడవిలో ఒంటరిగా వెళ్ళడం కన్నా ఇంకొకరు తోడు రావడమే మంచిదనిపించింది. సీతను వెతుకుతూ వెళుతున్న రాముడికి ఆంజనేయుడు తోడయినట్లు మా పూర్వీకులు ఊరు వెతుక్కుంటూ వెళుతున్న నాకు కొండన్నదొర జతయ్యాడు.

ఇద్దరం కలిసి అడవిలో అలా మైళ్ళకు మైళ్ళు నడిచి వెళుతున్నాం. చెట్లు, పుట్టలు, గుట్టలు, ఎగుడు దిగుళ్ళు అన్నీ దాటుకుంటూ వెళుతున్నాం. అక్కడక్కడ

చిన్న చిన్న జలపాతాలు. దూరంగా జంతువుల అరుపులు, చెట్లమీద నుంచి పక్షుల కిలకిలారావాలు... అదో కొత్త ప్రపంచంలోకి నేను నడిచి వెళుతున్నాను. దట్టంగా ఉన్న ఆ అడవిలో పచ్చని చెట్టుకొమ్మలు, తీగలు నన్ను ఆప్యాయంగా పిలుస్తున్నట్లు అనిపించసాగింది. నా చేతికి అందుతున్న ఆకుల్ని, పువ్వుల్ని, కాయల్ని తాకుతూ పరవశించి పోతున్నాను.

నన్ను చూసి ఆశ్చర్యపోతున్న కొండన్న దొర "నిన్ను సూత్తా వుంటే సిన్న పిల్లాడులా అనిపిత్తున్నావు దొర" అన్నాడు.

"అదేంటో కొండన్నా, ఎప్పుడూ నగరాల్లో ఉండే నాలాంటి వాళ్ళకు అడవిని చూస్తే ఇలాగే ఉంటుందేమో" అన్నాను.

"అదే సిత్రం దొర. ఎప్పుడూ ఇక్కడ ఉండే మాకు పట్నం సూత్తే ఎంత ఇదయి పోతుందో సెప్పలేను" అని అతను అనగానే ఇద్దరం నవ్వుకున్నాం.

మేం నడిచే దారిలో చెట్ల కింద ఎక్కడ చూసినా కుంకుడు కాయలు, ఉసిరికాయలు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. చింతచెట్లకు చింత పండు పండిపోయి వేలాడుతోంది. మరో పక్క కరక్కాయలు కనిపిస్తున్నాయి. చాలాచోట్ల చెట్ల మీద తేనె పట్లు కనిపిస్తున్నాయి. ఇవన్నీ ఇలాగే వదిలేస్తున్నారేంటీ అనిపించింది. అదే మాట అతన్ని అడిగాను. "ఇంత అటవీ ఫలసాయం ఇలా వృధాగా పడి ఉంది. వీటిని సేకరించే వారే లేరా?" అన్నాను.

"అంత ఓపిక, తీరిక ఇప్పుడెవరికి ఉంది దొర.. అడవంతా తిరిగి వీటన్నింటిని ఏరుకుని వెళ్ళి అమ్మితే మాకు దక్కేది అంతంత మాత్రమే. దళారులే బాగు పడుతున్నారు. ఇప్పుడు అదేదో ఉపాధి పథకం వచ్చిన తర్వాత దినానికి ఒక్కొక్కరికి వంద రూపాయలకు పైగా పెబుత్తమే ఇత్తోంది. పెద్దగా కట్టపడకుండానే డబ్బొత్తు న్నప్పుడు ఇంతగా కట్ట పడ్డానికి ఎవరొత్తారు దొర" అన్నాడు. నిజమే కదా అనిపించింది.

అప్పుడప్పుడు మాకు దారిలో కొంతమంది గిరిజనులు ఎదురు పడుతున్నారు. మా వంక మామూలుగా చూస్తూ వెళ్ళిపోతున్నారు. నా వేషం ఆధునికుడిగా

ఉన్నా, నా రూపం కొంతవరకు వారిలాగే ఉంటుంది మరి...

అలా ఎంతదూరం నడిచామో నాకు తెలియదు. కొంత సేపటికి దాహంగా అనిపించి నా భుజాన ఉన్న బ్యాగ్‌లో నుంచి వాటర్ బాటిల్ తీసి తాగబోయాను. కొండన్న నన్ను వారిస్తూ "దొరా దగ్గరలోనే ఒక యేరుంది. అందులో నీరు ఎంతో బాగుంటుంది. నువ్వు తప్పక రుసి సూడాల" అన్నాడు. సరేనని వాటర్ బాటిల్ బ్యాగ్‌లో పెట్టేశాను. కాసేపటికి అతను చెప్పిన యేరు వచ్చింది. కొండ కోనల్లోనుంచి ప్రవహించి వస్తున్న ఆ నీరు ఎంతో స్వచ్ఛంగా ఉంది. ఆ నీటిని రెండు దోసిళ్ళతో తీసుకుని కడుపునిండా తాగాను. నిజంగా ఆ నీటికి ఎంతో రుచి, జీవశక్తి ఉన్నట్లని పించింది. అడవిలోని ఎన్నో ఔషధ మొక్కల్ని తడుపుతూ వచ్చి ఆ నీరు ఇక్కడకు చేరుతున్నట్లు ఉంది.

నా ఆలోచన గ్రహించినట్లుగా కొండన్న దొర "ఈ నీటికి ఎంతో శక్తి ఉంది దొర. దాహం తీరడంతో పాటు అలసట పోగొడుతుంది. కాసేపట్లో మనం కొండ ఎక్కాల్సి ఉంది. అది ఎక్కి దిగేసరికి వంట్లో సత్తువ పోతుంది. అందుకే లాగుంది ఆ బగమంతుడు ఇక్కడ దీన్ని ఏర్పాటు చేశాడు. ఆ కొండ ఎక్కి దిగేవారంతా ఈ నీటిని తాగి వెళతారు" అని చెప్పాడు.

ప్రకృతిలో ఉన్న గొప్పతనం అదే. మనకేం కావాలో అవన్నీ సహజంగానే సృష్టిస్తుంది. కాని మనిషి స్వార్థంతో ప్రకృతిని, పర్యావరణాన్ని పాడు చేస్తూ తనకు తానే నష్టపోతున్నాడు అనిపించింది. మళ్ళీ ఇద్దరం నడవడం మొదలెట్టాం. చుట్టూ దట్టమైన అడవి, ఎత్తయిన చెట్లు, టేకు, మద్ది, చందనం, మామిడి, జీడిమామిడి, చింత, ఉసిరి, నారింజ, బత్తాయి, పనసచెట్లు, రకరకాల మొక్కలతో నిండి ఉంది. పైన చెట్ల కొమ్మల ఖాళీల నుంచి వెలుగు కనిపిస్తోంది.

"ఇక్కడ క్రూరమృగాలు ఉంటాయా?" ఉన్నట్టుండి నేనడిగిన ప్రశ్నకు కొండన్న నవ్వాడు. "ఎందు కుండవు దొర.. అడవన్నాక జంతువు లుంటాయి. పక్షులుంటాయి. పురుగు పుట్టా పాములు తిరుగాడుతుంటాయి. ఎప్పుడైనా జంతువులు ఎదురుపడినా కాసేపాగి చూసి వాటి మానాన అవి పోతాయి తప్ప మీద పడవు. ఈ అడవినే

నమ్ముకుని జీవించే వాళ్ళం. వాటితోనే మా సావాసం. ఇక రాత బాగోకపోతే అవి మీద పడతాయి. చేతనైతే పోరాడతాం... లేదంటే...” అని చిన్నగా నవ్వాడు. అతనలా చెబుతోంటే నా ఒళ్ళు జలదరించింది.

అలా నడుస్తూ వెళ్ళగా వెళ్ళగా... మేం ఎక్కిదిగాల్సిన కొండ వచ్చింది. అది ఎక్కడం మొదలెట్టాం. కొండ ఏటవాలుగా ఉంది. మొక్కలు దుబ్బలతో పచ్చగానే ఉంది. కాలిబాట ఉన్నా నాకు ఎక్కడం కష్టంగానే ఉంది. ‘జాగత్త దొర’ అంటూ అతను చకచకా ఎక్కేస్తున్నాడు. అలవాటు లేక పోవడంతో నేను నెమ్మదిగా అడుగులు వేస్తున్నాను.

నేను చేరవలసిన గమ్యానికి చేరువవుతుంటే మళ్ళీ నాలో ఉద్వేగం... మా తాత ముత్తాతలు జీవించిన ఆ ఊరిని కాసేపట్లో చూడబోతున్నాను. రామరాజుగూడెం అని పిలిచే ఆ చిన్న గ్రామం ఎలా ఉంటుంది. అక్కడి వాళ్ళు ఎలా జీవిస్తుంటారు. మా వాళ్ళంతా పోడు వ్యవసాయం చేసే వారని నాన్న చెప్పేవారు. మా పూర్వీకులంతా ఆ అడవిలో ప్రకృతి ఒడిలో కల్లా కపటం, చీకూ చింతా లేకుండా జీవించారు. ఎదుటి వారిని మోసం చేయాలనే ఆలోచన లేకుండా అడవి తల్లిని నమ్ముకుని జీవనం సాగించిన వాళ్ళంతా ఇప్పుడు ఈ లోకంలో లేరు. వారి గురించి తెలిసిన వాళ్లెవరన్నా అక్కడ ఉంటారేమో కనుక్కోవాలి.

మా వంశంలో అందరికీ ఒక్కరే సంతానమంట... అదీ మగ సంతానమే. మా ముత్తాతకు తాత. తాతకు మా నాన్న. మా నాన్నకు నేను. ఇలా మా వంశంలో అందరికీ ఒక్కడే వారసుడు. మా అమ్మకు తల్లిదండ్రులు లేరు. ఆమె చిన్నప్పుడే వాళ్ళు పోయారంట. ఎవరూ లేని ఆమెను మా తాత చేరదీసి పెంచి నాన్నకిచ్చి పెళ్ళి చేశాడంట. అందుకే మా అమ్మ తరుపు వాళ్ళు అక్కడ ఉండే అవకాశమే లేదు.

నేను ఆ ఊరు చేరగానే అక్కడి నేల తల్లికి శిరస్సు వంచి నమస్కరించాలి. ఆ భూమిని ముద్దాడాలి. అక్కడి మట్టిని నా నుదుటికి విభూదిలా రాసుకోవాలి. అమ్మ కోరినట్టుగా ఆ మట్టిని పదిలంగా తీసుకువెళ్ళి ఆమెకు బహుమతిగా ఇవ్వాలి.

కొండ ఎక్కడం పూర్తయ్యింది. ఆ కొండ మీద నుంచి చూస్తే అవతల వైపు దూరంగా నది కనిపిస్తోంది. నెమ్మదిగా కొండ దిగడం మొదలెట్టాం. కాసేపట్లో మా పూర్వీకులు ఊరు చూడ బోతున్నానన్న ఆనందం నన్ను ప్రశాంతంగా ఉండ నివ్వడం లేదు. నేను ఉద్విగ్నానికి లోనవుతున్నాను. నా గుండె వేగంగా కొట్టుకుంటోంది. సివిల్ సర్వీసు పరీక్షలు రాస్తున్నప్పుడు కూడా నేను ఎప్పుడూ తడబడ లేదు. ఆందోళన చెందలేదు. మరి ఇప్పుడేంటి.....!

కొండ దిగి కొంతదూరం వెళితే ఆ ఊరు వస్తుందట. కాసేపటికి కొండ దిగడం పూర్తయింది. నా వళ్ళంతా చెమట్లు పట్టేశాయి. నడక అలవాటు లేకపోవడం వల్ల నీరసంగా అనిపించ సాగింది. అయినా ఏదో ఉత్సాహం నన్ను ఊరివైపు నడిపిస్తోంది. నడకలో వేగం పెంచి గబగబా అడుగులు వేయసాగాను.

నన్ను చూసి కొండన్న నవ్వుతూ "దొరా నీలో అలసట కనిపిత్తా లేదు. ఎంత తొరగా మీ ఊరు సూద్దామా అన్న ఆత్రం కనిపిత్తోంది..." అన్నాడు. నేను చిన్నగా నవ్వాను. కొండ దిగాక మళ్ళీ ఎదురుగా కనిపిస్తున్న అడవిలో నడుస్తున్నాం. అమ్మ చెప్పిన గురుతులు ప్రకారం ఆ ఊరికి చేరువగా వచ్చేశాం. ఇక నా కళ్ళు ఆ గ్రామాన్ని వెతుకుతున్నాయి. నా లెక్క ప్రకారం ఇప్పుడు మా తాత ముత్తాతల ఊరు కనిపించాలి.

కాని అక్కడ ఊరు బదులు అంతా నీరే కనిపిస్తోంది. ఊరేది....! మేం దారి తప్పి వచ్చామా! నా కంతా అయోమయంగా అనిపించసాగింది. ప్రక్కనే ఉన్న కొండన్నదొర వంక చూశాను. అతను కూడా 'ఇదేంటి దొరా... ఇక్కడ ఊరు లేదు?" అన్నాడు. నాకేం చేయాలో పాలు పోవడం లేదు.

ఇంతలో అటుగా ఒక వ్యక్తి రావడం కనిపించింది. అతను ధరించిన దుస్తులు చూస్తుంటే అటవీశాఖ ఉద్యోగిలా కనిపిస్తున్నాడు. అతని దగ్గరకు వెళ్ళి "ఏమండీ, ఇక్కడ రామరాజుగూడెం అని గ్రామం ఉండాలి, ఎక్కడుంది?" అనడిగాను. అతను నా వంక ఎగాదిగా చూశాడు. అతను ఏం చెబుతాడోనని నా గుండె వేగంగా కొట్టుకోసాగింది.

అతను “రామరాజుగూడెమా.....!” అన్నాడు.

“అవునండి” అన్నాను వెంటనే.

“అడవికి కొత్తా?” అనడిగాడు మళ్ళీ.

నాకు చిరాకేసింది. ఇతనేంటి. అడిగినదాని గురించి చెప్పకుండా ఏదేదో అడుగుతాడు అనుకున్నాను. అయినా అవసరం నాదికాబట్టి “అవును, కొత్తే..” అన్నాను.

“రామరాజుగూడెం..” అని చెప్పబోతున్న అతని మాటలు ఇంకా పూర్తికాకుండానే.

“తొరగా చెప్పండి. ఆ గూడెం ఎక్కడుంది...?” ఆతృత నిండిన గొంతుతో ప్రాధేయపడినట్లుగా అడిగాను.

అతను తన కుడిచేతి చూపుడు వ్రేలిని ఎదురుగా ఉన్న నీళ్ళ వైపు చూపిస్తూ “రామరాజుగూడెం ఆ నీళ్ళకింద ఉంది” అన్నాడు. ఆ మాట వినగానే నాకు మతి పోయినట్లనిపించింది.

“....ఆ నీళ్ళ కింద ఉండడమేమిటి?” నీరసంగా అడిగాను. నా గొంతులో నుంచి సరిగా మాటలు రావడం లేదు.

దానికతను “అదిగో అక్కడ ఎదురుగా కనిపిస్తోందే సాగునీటి ప్రాజెక్టు... అది ఈ మధ్యనే కట్టారు. ఆ ప్రజెక్టు వల్ల ఇక్కడి గిరిజన గ్రామాలన్నీ ఖాళీ చేయించేశారు. ఆ గ్రామాలన్నీ ఇప్పుడు ఆ నీటి కిందే ఉన్నాయి మరి...” అని చెప్పి ఇక తన పని అయిపోయినట్లు ముందకు వెళ్ళిపోయాడు.

ఆ నీటిని చూస్తుంటేనా కళ్ళ వెంట ధారాపాతంగా కన్నీళ్ళు కారి పోతున్నాయి. మా తాత ముత్తాతల ఊరి ఆనవాళ్లు లేకుండా మొత్తమంతా నీరే....

అమ్మ కోరిక తీర్చలేక పోతున్నందుకు నాకు దు:ఖం ముంచుకొచ్చింది. అక్కడే కూలబడి వెక్కివెక్కి ఏడుస్తున్న నా భుజం మీద కొండన్న దొర చెయ్యి వేసి ఓదార్చుతున్నాడు. ‘మా ఊరిని నాకు తెచ్చివ్వండీ’ అని గట్టిగా అరవాలనిపిస్తోంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Padamati+Sandhya+Ragam**

* * *